
సాక్షి
ఒడిశా
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,57,458లు, బంగారం 2.4 గ్రాములు, వెండి 27.2 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.


అకాల వర్షాలతో అతలాకుతలం - 8లో


వేసవి విపత్తు నిర్వహణకు సన్నద్ధం - 8లో

న్యూస్‌రీల్

ఎండీఎం సిబ్బందికి శిక్షణ
- నేటి నుంచి 8దశల్లో కొనసాగనున్న శిబిరం

భువనేశ్వర్: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణలో పరిశుభ్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోంది. ఈ మేరకు పకడ్బందీ సన్నాహాలకు నడుం బిగించింది. మధ్యాహ్న భోజన ప్రక్రియలో ప్రధానపాత్ర పోషించే వంటపుట్టి, పోటు సహాయ కార్మికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. తమను తాము ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి, ఆహారాన్ని పరిశుభ్రంగా ఎలా తయారు చేయాలి, ఆహారాన్ని నిల్వ ఉంచే చోట ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి అనే అంశాలపై శిక్షణ ఇస్తారు. మిషన్‌శక్తి భవన్‌లో జరిగే శిక్షణ శిబిరం 8దశల్లో ఉంటుంది. ఈ కార్యక్రమంలో 600మందికి పైగా వంటపుట్టి, వారి సహాయ కార్మికులు శిక్షణ పొందుతారు. ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసిన వారు మండల స్థాయిలో ప్రాంతీయ వంటపుట్టీలు, సహాయకులకు శిక్షణ అందిస్తారు.

తరగతి గది ప్రారంభం

తరగతి గది ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముదులి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి ప్రభుత్వ పాఠశాలలో సుమారు రూ.28 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదిని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యావిధానానికి పెద్దపీట వేస్తోందని, 5టీ పథకంలో భాగంగా ఇప్పటికే కొన్ని పాఠశాలలను ఆధునీకరించి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. అదేవిధంగా స్థానిక పాఠశాలలోని విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా మినరల్ ఫండ్(డీఎంఎఫ్) నిధుల నుంచి కేటాయించిన రూ.28 లక్షల వ్యయంతో తరగతి గదిని నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి, పాఠశాల కమిటీ అధ్యక్షుడు సురేష్‌కుమార్ పాత్రొ తదితరులు పాల్గొన్నారు.

దోపిడి దొంగలు అరెస్ట్
- 10 వ్యవసాయ మోటార్లు, బ్యాటరీ స్వాధీనం చేసుకున్న పోలీసులు


పోలీసుల అదుపులో నిందితులు, మోటార్లు


బరంపురం: గత కొద్ది రోజులుగా నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న చోరీ ఘటనలకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10 వ్యవసాయ మోటార్లు, బ్యాటరీ స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి బసంత్‌కుమార్ సెఠి తెలిపిన వివరాల ప్రకారం నిమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామ శివార్లలో ఉన్న వ్యవసాయ మోటార్లు వరుసగా అదృశ్యమవుతున్నాయి. దీనిపై బాధిత రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి,. దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని, విచారించగా.. చోరీ ఘటనలను అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఇరువురినీ అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇదే జిల్లాకు చెందిన సోను నాయక్, కిచన్ మామగా గుర్తించారు.

డ్రైన్లు మరమ్మతు చేయాలని వినతి

ఎస్ఈ సామల్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కౌన్సిల్

పర్లాకిమిడి: స్థానిక పురపాలక సంఘం కార్యాలయానికి ఆనుకుని ఉన్న మురుగు కాలువలకు మరమ్మతులు చేయాలని పురపాలక కౌన్సిల్ అధ్యక్షురాలు నిర్మలా శెఠి, వైస్ చైర్మన్ లెంక మధు, ఐదో వార్డు కౌన్సిలర్ బాలకృష్ణ పాత్రొ, నాలుగో వార్డు నారాయణరావు బెహరా, 12వార్డు పి.ఉమాశంకర్ తదితరులు కోరారు. ఈ మేరకు రోడ్లు, భవనాలశాఖ సూపరింటెండింట్ ఇంజినీర్ శ్రీకాంత్ సామల్‌ను గురువారం కలిసి, వినతిపత్రం అందజేశారు. పర్లాకిమిడి ఫారెస్ట్ గేటు నుంచి పాత కోర్టు జంక్షన్ వరకు రోడ్లు, భవనాల శాఖ ఆధీనంలో ఉన్నందున, పరిశీలించి, పనులు ప్రారంభించాలని విన్నవించారు.

భగ్గుమన్న పాతకక్షలు!


అరుణ హత్యకు గురైన ప్రాంతంలో రక్తపు మరకలు

- యువకుడిని వెంటాడి హత్య చేసిన ప్రత్యర్థి వర్గం
- వాలీబాల్ ఆడుతుండగా చుట్టుముట్టి కత్తులతో దాడి
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌డీపీఓ హరీష్


మృతదేహంతో బంధువులు

జయపురం: పట్టణంలో గత కొంతకాలంగా హత్యలు, దాడులు పెరిగిపోతున్నాయి. కొద్దిరోజుల క్రితం వ్యాపారిపై దుండగులు తుపాకీతో కాల్పులు జరిపిన ఘటన మరువకముందే.. బుధవారం రాత్రి అటువంటి దుశ్చర్యే పునరావృతమైంది. పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిని ప్రత్యర్థి వర్గానికి చెందిన దుండగులు వెంటాడి, హతమార్చారు. జయపురం పట్టణ పోలీసు పరిధి కొత్త వీధిలో ఈ అమానుష ఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 5వ లైన్‌లో నివాసం ఉంటున్న అరుణ అనాక(25) బుధవారం సాయంత్రం స్థానిక జగన్నాథ మందిర సమీపంలో వాలీబాల్ ఆడేందుకు వెళ్లాడు. రాత్రి 7గంటల సమయంలో ఆటోలో వచ్చిన 4, 5మంది దుండగులు ఒకేసారి యువకుడిని చుట్టుముట్టి కత్తులతో దాడికి దిగారు. ప్రాణభయంతో అరుణ పరుగులు తీయగా.. వెంబడించి, రోడ్డు మధ్యలో హతమార్చారు. యువకుడి చేతులు, శరీరంపై అనేక చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. శరీరమంతా రక్తశిక్తం కాగా, రోడ్డుపై రక్తం చిందడం కనిపించింది. ప్రాణభయంతో అరుణ్ కేకలు వేయగా గమనించిన చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొనే సమయానికి దుండగులు పరారయ్యారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న యువకుడిని వాహనంలో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకు వెల్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. సమాచారం అందుకున్న జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బీసీ, పట్టణ పోలీసు అధికారి సంబిత్ బెహరా, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొన్నారు. చుట్టుపక్కల వారిని విచారించగా, పాత కక్షల కారణంగా హతమార్చినట్లు భావిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, హంతకులను పట్టుకొనేందుకు గాలిస్తున్నారు. మరోవైపు కొత్తవీధికి చెందిన వందలాది మంది ఆస్పత్రికి చేరుకొని, హత్యకు నిరసనగా ఆందోళనకు దిగారు. నిందితులను అరెస్టు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు.


విలపిస్తున్న కుటుంబ సభ్యులు


పోలీసులను చుట్టుముట్టిన స్థానికులు

కాపాడబోయి.. కొట్టుకుపోయాడు!


ఘటనా స్థలంలో గుమిగూడిన స్థానికులు, బాధిత కుటుంబీకులు

- కేంద్రపడా జిల్లా బ్రహ్మణి నదిలో పడవ బోల్తా
- ప్రయాణికులను రక్షించే క్రమంలో బోట్ మ్యాన్ గల్లంతు
- బాలుడి మృతి.. కొనసాగుతున్న గాలింపు


బ్రహ్మణి నదిలో కొనసాగుతున్న గాలింపు చర్యలు

భువనేశ్వర్: కేంద్రపడా జిల్లా ఔల్ ప్రాంతం బ్రహ్మణి నదిలో పడవ బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో బాలుడు మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. గురువారం ఉదయం ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. సుమారు 30మంది ప్రయాణికులు, మోటారు వాహనాలతో వెళ్తున్న పడవ అకస్మాతుగా బోల్తా పడింది. రాజ్‌నగర్ ప్రాంతం ఎకొమానియా నుంచి కెరొడొగాడా వైపు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. దాదాపు ఈ రెండు ప్రాంతాల మధ్యలో అదుపు తప్పి బోల్తా పడింది. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది.. వెంటనే రంగంలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. కొన్ని గంటల నిరవధిక గాలింపు అనంతరం ఓ బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు దేబేంద్ర బెహరా(12)గా గుర్తించారు. అయితే పడవ నడిపే వ్యక్తి సుదర్శన్ స్వాయి గల్లంతు కాగా.. సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు. దీంతో గాలింపు నిరవధికంగా కొనసాగిస్తున్నారు. సుదర్శన్ సమయ స్ఫూర్తితో బోల్తాకొట్టిన పడవ నుంచి నీట మునిగిన ప్రయాణికులను ఒక్కొక్కరుగా రక్షించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బాలుడిని ఆదుకునే క్షణంలో బలమైన నీటి ప్రవాహంతో గల్లంతైనట్లు పేర్కొన్నారు. మొత్తం ప్రయాణికుల్లో 28మంది ప్రాణాలతో బయట పడినట్లు గుర్తించారు.

రూ.4 లక్షల సాయం..

పడవ ప్రమాదంలో బాలుడు మృతి పట్ల ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సంతాపం వ్యక్తం చేశారు. మృతిచెందిన బాలుడి కుటుంబీకులకు రూ.4 లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. గురువారం సాయంత్రం లోగా అనుబంధ వర్గాలకు ఈ సొమ్మును అందజేయాలని కేంద్రపడా జిల్లా కలెక్టర్‌కు ఆదేశించారు. పడవలో బైక్‌లతో పాటు 30మందికి పైగా ప్రయాణికులతో నీట మునగడం విచారకరమన్నారు. ఇద్దరు మినహా ప్రయాణిస్తున్న మిగిలిన వారంతా ప్రాణాలతో బైటపడటం ఉపశమనంగా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. గల్లంతైన వారి కోసం గాలింపు ప్రారంభించిన 2గంటల తర్వాత బాలుడు దేబేంద్ర బెహరా మృతదేహం లభ్యమైంది. బోటు మ్యాన్ సుదర్శన్ కోసం గాలింపు కొనసాగుతోంది.

మల్కన్‌గిరిలో హైఅలర్ట్


పొడియా సరిహద్దులో కూబింగ్ నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు

- దంతెవాడ మావోయిస్టు దుశ్చర్య నేపథ్యంలో కూబింగ్ ముమ్మరం


మావోయిస్టులు విడుదల చేసిన లేఖ

మల్కన్‌గిరి: జిల్లాలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో రాష్ట్రప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్(డీఆర్‌జీ) దళంపై దంతెవాడలో బుధవారం చోటు చేసుకున్న మందుపాతర పేలుడు ఘటన నేపథ్యంలో మల్కన్‌గిరి ఎస్పీ నితీష్ వాధ్వనీ ప్రత్యేక రక్షణ చర్యలకు ఆదేశించారు. ఘటన అనంతరం సరిహద్దు ప్రాంతాల నుంచి మావోయిస్టులు జిల్లాలోకి చొచ్చుకువచ్చే అవకాశం ఉన్నందున్న పొడియ, మత్తిలి క్యాంగ్, తులసిపహడ్, ఛలాన్‌గుడ, కలిమెల ప్రాంతాల్లో కూబింగ్ ముమ్మరం చేశారు. అటవీ మార్గంలో బీఎస్ఎఫ్, ఎస్ఓజీ, డీబీఎఫ్ జవాన్లతో పాటు జిల్లా పోలీసులు అణువణువూ జల్లెడ పడుతున్నారు. ఎక్కడికక్కడ వాహనాలను తనిఖీ చేస్తూ అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. జిల్లాను ఆనుకొని ఉన్న సరిహద్దులను సీజ్ చేశారు. దర్భ డివిజన్ కమిటీ మావోయిస్టులు ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గురువారం దర్భ డివిజన్ కార్యదర్శి సాయినాథ్ గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ సంపదను దోచుకోవడం కోసమే మావోయిస్టులపై నీఘా పెట్టారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆకాశ మార్గాన సర్వే చేస్తున్నారని, దీనిని విరమించకుంటే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తరతరాలుగా గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూములపై ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కేంద్ర ప్రభుత్వాలకు ఎటువంటి హక్కు లేదని లేఖలో పేర్కొన్నారు.

డొంగరదేవి విగ్రహ ప్రతిష్ట ప్రారంభం


కలశాలతో నందగుడకు యాత్రగా వెళ్తున్న భక్తులు

జయపురం: స్థానిక సమితి నందగుడ గ్రామంలోని డొంగరదేవి మందిరంలో విగ్రహ ప్రతిష్టా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. 3రోజులు జరుగనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు కలసయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు జయపురం జగన్నాథ సాగర్ నుంచి కలసాలలో పవిత్ర జలాన్ని నింపి, ఊరేగింపుగా గ్రామానికి తీసుకువచ్చారు. వాటిని మందిరం ఆవరణలో ప్రతిష్టించి, జలఘాట్, మండలీకరణ, అంకురారోపణ కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్ర మోహనపాత్రొ, డొంబురు దొర, పురోహితులు పురుషోత్తమ నందా, కాళీప్రసాద్ దేవశర్మ, స్వప్నశర్మ సమక్షంలో పూజలు జరగ్గా.. గ్రామపెద్దలు మోటు పొరజ, తులారాం జాని, మాన్‌సింగ్ జాని, ధనపతి ముదులి తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

పులసరా అభివృద్ధికి చర్యలు


తాగునీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీకాంత్ సాహు

బరంపురం: జిల్లాలోని పులసరా బ్లాక్ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి శ్రీకాంత్ సాహు తెలిపారు. స్థానిక బ్లాక్ పరిధిలో గురువారం పర్యటించిన ఆయన.. రూ.1.56 కోట్ల నిధులతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అలాగే వివిధ గ్రామాల్లో తాగునీటి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో బ్లాక్ ఉపాధ్యక్షురాలు అమితా సాహు, జిల్లా పరిషత్ సభ్యులు ఎస్.కిశోర్‌చంద్ర రెడ్డి, సర్పంచ్ టి.నర్సింహారెడ్డి, సమితి సభ్యుడు జయదేవ్ లంకా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహం


నగర పరిక్రమలో సంకీర్తన మండలి భక్తులు

పర్లాకిమిడి: పట్టణంలోని కరణం వీధి చిన్నరాధాకాంత మఠం, నృసింహస్వామి మఠంలో మహంత నరోత్తమ దాస్ 33వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవత సప్తాహ జ్ఞాన పారాయణం గురువారం నిర్వహించారు. అలాగే గంజాం, పూరీ జిల్లాల నుంచి వచ్చిన మహంతలు భజనలు చేస్తూ నగర పరిక్రమ జరిపారు. హరినామ సంకీర్తన మండలి సభ్యులు గోవింద దాస్, మధుసూదన దాస్, మహంత రామనంద దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే.. మూల్యం తప్పదు

- తనపై ఆరోపణలు ఖండించిన మాజీ ఎంపీ నెక్కంటి
- లారీ యజమానుల నుంచి వసూళ్లను నిరూపించాలని సవాల్



విలేకర్లతో మాట్లాడుతున్న నెక్కంటి భాస్కరరావు

రాయగడ: మావోయిస్టుల పేరిట చందాల వసూలు, స్థానిక లారీ యజమానుల సంఘంలో నిధులు కాజేయడం వంటి నిరాధార ఆరోపణలు తనపై చేసే ప్రతిఒక్కరూ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు స్పష్టంచేశారు. గత కొద్ది రోజులుగా తనపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణలు ఖండించారు. వాటిలో ఎటువంటి వాస్తవాలు లేవని, తన రాజకీయ ఎదుగుదలను సహించలేని వారి కుట్ర మాత్రమేనని తేల్చిచెప్పారు. పట్టణంలోని రాణిగుడ ఫారంలో ఆయన నివాసంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నెక్కంటి మాట్లాడారు. స్థానిక లారీ యజమానుల సంఘంలో ఇటీవల చోటు చేసుకున్న అంతర్గత విభేదాలను ఆసరాగా తీసుకున్న ప్రతిపక్ష నాయకులు.. తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 40 ఏళ్ల క్రితం కేవలం 30 లారీల యజమానులతో ప్రారంభమైన ఈ సంఘం.. ప్రస్తుతం అంచెలంచెలుగా ఎదిగిందని తెలిపారు. యజమానుల సంక్షేమ కోసం అప్పట్లో ప్రారంభమైన సంఘం ఎంతోమంది జీవితాలకు ఆసరగా నిలిచిందన్నారు. లారీలో డ్రైవర్లుగా, హెల్పర్లుగా పనిచేసే వారు ఇప్పుడు.. యజమానులుగా మారారని పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం ఈ సంఘం రిజిస్ట్రేషన్ కూడా చేసుకుని, తన కార్యకలాపాలను కొనసాగిస్తుందని గుర్తుచేశారు. అయితే ఇదంతా మింగుడు పడని కొందరు.. లారీ యజమానుల సంఘంలో నిధులు దుర్వినియోగం అవుతున్నాయనడంలో ఎటువంటి వాస్తవం లేదని స్పష్టంచేశారు.

భంగపడ్డవారిదే ఇదంతా..

తన 40ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని, ఉన్నత లక్ష్యాన్ని చేరుకోగలిగానని నెక్కంటి తెలియజేశారు. సుదీర్ఘమైన రాజకీయ జీవితంలో ఎటువంటి అవినీతి మచ్చలేదన్నారు. ప్రజల ఆశీర్వాద బలంతోనే ఈ స్థాయిలో ఉన్నానని, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. గత 30 ఏళ్లగా రాయగడ మున్సిపాలిటీలో బీజేడీనే గెలిపిస్తూ వస్తున్నారంటే పార్టీపై ప్రజలకు ఉన్న ఆదరాభిమానాలకు నిదర్శనంగా చెప్పవచ్చన్నారు. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో చైర్మన్ పదవిని ఆశించి, భంగపడ్డ వారంతా కూటమిగా చేరి, తనను రాజకీయంగా దెబ్బకొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని అనుమానం వ్యక్తంచేశారు. ప్రజల ఆశీర్వాద బలం ఉన్నంత వరకు తనకు ఏమీ కాదని ధీమా వ్యక్తంచేశారు. శంఖం జెండాపై లబ్ధి పొందిన కొందరు వ్యక్తిగత స్వార్థంలో పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని వివరించారు.

ఎటువంటి దర్యాప్తుకైనా సిద్ధం..

మావోయిస్టులు పేరిట చందాలు వసూలు చేస్తున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో తాను ఎటువంటి దర్యాప్తుకైనా సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా నెక్కంటి సవాల్ విసిరారు. కొందరి స్వార్థపరుల మాటలు నమ్మిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక ఇటువంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఎంతో రాజకీయ అనుభవం కలిగిన ఆయన.. నిజానిజాలు తెలుసుకోకుండా చెప్పుడు మాటలకు లొంగిపోవడం విచారకరమని తెలిపారు. తనపై అసత్య ఆరోపణలు చేసే ప్రతీ ఒక్కరికీ త్వరలో తగిన సమాధానం చెబుతానని, దీనికి న్యాయపరంగా తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని స్పష్టంచేశారు.

క్లుప్తంగా

మాజీ అకౌంటెంట్‌కు ఏడేళ్లు జైలు

భువనేశ్వర్: జట్నీ(ఖుర్దారోడ్) మున్సిపల్ కౌన్సిల్ మాజీ అకౌంటెంట్‌కు శరత్ దాస్‌కు విజిలెన్స్ కోర్టు జైలుశిక్ష విధించింది. 2 వేర్వేరు కేసుల్లో విచారణ జరిపిన న్యాయస్థానం.. నిందిత ఉద్యోగికి క్రమంగా నాలుగేళ్లు, మూడేళ్లు జైలుశిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువడించింది. రోడ్డు, డ్రెయిన్ పనుల బిల్లులు చెల్లించేందుకు శరత్‌దాస్ రూ.35 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. దీనిపై నమోదైన కేసు, విచారణపై వాదనలు విన్న విజిలెన్స్ కోర్టు.. పై విధంగా తీర్పునిచ్చింది.

గణిత ఫోరం నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన గణిత ఫోరం

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ గణితఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్ త్రినాథరావు ఆధ్వర్యంలో ఎంఆర్ హైస్కూల్‌లో జరిగిన ఎన్నికలో ఫోరం గౌరవాధ్యక్షుడిగా ఐఎస్‌ఈ శర్మ, అధ్యక్షుడిగా వి చిన్నంనాయుడు, ప్రధానకార్యదర్శిగా కె.కృష్ణంరాజు, కోశాధికారిగా కె. చంద్రశేఖర్,ఉపాధ్యక్షులుగా డీవీ సూర్యనారాయణ, ఎం.శ్రీనివాసరావు, కె.శివప్రసాద్, బి.శ్రీనివాసరావు, ఎన్ రమేష్, కార్యదర్శులుగా ఎస్‌కె.హుస్సేన్, పి.శ్రీనివాసరావు, జోగేంద్ర, డి కామేశ్వరరావు, రామకృష్ణబాబు ఎన్నికయ్యారు.స్టేట్ కౌన్సిలర్స్‌గా ఎ.లక్ష్మణరావు ఎన్నికయ్యారు.

నిర్వాసితులకు పట్టాలు అందజేత



నిర్వాసితుడికి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు


భోగాపురం: విమానాశ్రయ నిర్మాణంలో భాగంగా గృహాలు కోల్పోయి, 2015 ఆగస్టు 18 నాటికి అర్హులైన బొల్లింకలపాలెం, ముడసర్లపేట, మరడపాలెం, రెల్లిపేట, బైరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన 28 కుటుంబాలకు ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గురువారం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి, మట్టా అయ్యప్ప, కొండపు కొత్తయ్యరెడ్డి, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యాయత్నం

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయిన ఇద్దరు విద్యార్థులు మనస్థాపంతో గురువారం ఆత్మహత్యాయత్నం చేశారు. రాజాం మండలం కంచరాం గ్రామానికి చెందిన వల్లూరు జగన్మోహనరావు ఇంట్లో ఎవరూలేని సమయంలో చీమల మందుతాగి తల్లికి ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే ఆమె అప్రమత్తమై భర్త జగన్నాథంతో కలిసి రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం నారన్నాయుడువలస గ్రామానికి చెందిన బిల్లాన మీనాక్షి కూడా ఇంటర్ ఫెయిల్ కావడంతో చీమల మందు సేవించిందని కుటుంబీకులు తెలిపారు. ఆమె కూడా రాజాం ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు పొందుతోంది. ఇరువురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

అకాల వర్షాలతో అతలాకుతలం

- గత 3రోజులు కొరాపుట్ జిల్లావ్యాప్తంగా వర్షాలు
- గాలుల ధాటికి నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



కొలాబ్ జలాశయంలో స్వల్పంగా పెరిగిన నీటిమట్టం

జయపురం: గత మూడు రోజులుగా పెనుగాలు, ఉరుములు, పిడుగులు, వడగళ్లతో పడుతున్న ఆకాల వర్షాలకు జయపురం సబ్ డివిజన్‌లో జనజీవనం అతలాకుతలమైంది. పగలంతా ఎండ తీవ్రంగా ఉంటూ.. సాయంత్రం కురుస్తున్న వడగల్ల వానకు కొరాపుట్ జిల్లాలోని జయపురం, సమితి, బొయిపరిగుడ, బొరిగుమ్మ సమితిలలో పంటలకు తీవ్రనష్టం కలిగింది. వివిధ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనేక గ్రామాలు అంధకారంలో చిక్కుకుపోయాయి. అధికారుల అంచనాల ప్రకారం అకాల వర్షాలతో బొరిగుమ్మ సమితిలో 100కు పైగా విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా, 10 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. అలాగే ఆయా సమితుల్లో 200 ఎకరాల్లో మొక్కజొన్న, వరి ఇతర పంటలు నేలకొరిగాయి. మొరిగుమ్మ అవులి గ్రామంలో వడగళ్ల వాన ఆందోళన కలిగించింది. ఇళ్ల పైకప్పులు ఎగిరి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నిలిచిపోయిన రాకపోకలను పునరుద్ధరించేందుకు ఓడ్రాఫ్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు.



బొరిగుమ్మ సమితిలో కుప్పకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

స్వల్పంగా పెరిగిన నీటిమట్టం

జయపురం: కొరాపుట్ జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు వివిధ జలాశయాల్లో నీటిమట్టం పెరిగింది. గత ఏడాది ఏప్రిల్ నెలాఖరుకు అప్పర్ కొలాబ్ జలాశయంలో 846.47 మీటర్లు ఉండగా.. ప్రస్తుతం 865.21 మీటర్లకు చేరుకుంది. మాచ్‌ఖండ్ జల విద్యుత్ ప్రాజెక్టు జలాశయంలో స్వల్పంగా 0.35 అడుగులు పెరిగింది. నవరంగపూర్ ఇంద్రావతి ప్రాజెక్టులో గత ఏడాది కంటే 3.38 మీటర్ల నీటిమట్టం అధికంగా నమోదైంది. అలాగే మల్కన్‌గిరి జిల్లాలోని బలిమెల జలవిద్యుత్ ప్రాజెక్టు జలాశయంలో గత ఏడాది ఇదే సమయానికి 1461.2 అడుగులు నీటిమట్టం ఉండగా.. ప్రస్తుతం 2 అడుగులు తక్కువగా 1459.20 అడుగులకు చేరుకుంది.




బొయిపరిగుడలో గాలుల ధాటికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు



నేలకొరిగిన చెట్లను తొలగిస్తున్న ఓడ్రాఫ్ సిబ్బంది

వేసవిలో విద్యార్థులకు ఐఎఫ్ మాత్రలు

- రక్తహీనత నిర్మూలనకు రాష్ట్రప్రభుత్వం చర్యలు
- వారానికి ఒకటి చొప్పున ఒక్కొక్కరికి 8 ట్యాబ్లెట్లు పంపిణీ



భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రభుత్వ సహాయక పాఠశాలల్లో ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఐరన్, ఫోలిక్ యాసిడ్(ఐఎఫ్‌ఏ) మాత్రలను పంపిణీ చేయనున్నారు. రక్తహీనత నిర్మూలనే లక్ష్యంగా అభియాన్(అమ్లాన్) కార్యక్రమం కింద పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈనెల 24న జరిగిన ప్రధానమంత్రి పోషణ్ పథకం సమీక్ష సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర పాఠశాలలు-సామూహిక విద్య(ఎస్అండ్ఎంఈ) విభాగం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఈ ఏడాది జూన్ 16 వరకు ఐఎఫ్‌ఏ మాత్రలను అందించనున్నారు.

వారానికి ఒక మాత్ర..

విద్యార్థులు వారానికి ఒక రోజు ప్రతి సోమవారం ఒక ఐఎఫ్‌ఏ టాబ్లెట్ వేసుకోవాలి. సెలవుల నిడివిలో ఈ మాత్రలు ఈ లెక్కన వినియోగించాలని ఉత్తర్వులు స్పష్టంచేశాయి. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు లేదా పెద్దలు ప్రత్యక్షంగా పర్యవేక్షించి, మాత్రలు వినియోగం పట్ల శ్రద్ధ వహించాలని విభాగం అభ్యర్థించింది. ప్రతి సోమవారం మధ్యాహ్నం లేదా రాత్రి భోజనం(లంచ్/డిన్నర్) తర్వాత వారి తల్లిదండ్రులు/సంరక్షకుల సమక్షంలో గ్లాసు నీళ్లతో ఒక మాత్రను తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ మేరకు అవసరమైన మార్గదర్శకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించడంలో అనుబంధ వర్గాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు.

రెండు రంగుల్లో మాత్రలు..

ఒక్కో విద్యార్థికి 8 చొప్పున ఐఎఫ్‌ఏ ట్యాబ్లెట్‌లను పాఠశాల ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో పంపిణీ చేయాలని ఉత్తర్వులు పేర్కొన్నాయి. ఐఎఫ్‌ఏ(పింక్) టాబ్లెట్ ఒకటి నుంచి 5 తరగతుల విద్యార్థులకు, ఐఎఫ్‌ఏ(నీలం రంగు) టాబ్లెట్ 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. విద్యార్థుల ఇంటి ముంగిట తల్లిదండ్రుల సమక్షంలో ఉపాధ్యాయులు ఈ మాత్రలు అందజేస్తారు. వినియోగం కాల పరిమితి తేదీలను క్షుణ్ణంగా పరిశీలించిన మేరకు పంపిణీ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించారు.

పట్టుబడిన మాయ‘లేడీ’



బాధితుడికి నగదు అందజేస్తున్న సీఐ రవికుమార్

- సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తింపు
- మూడు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు
- దొంగిలించిన రూ.60వేలు నగదు స్వాధీనం

రాజాం సిటీ: రద్దీ ప్రాంతాల్లో ఏమరుపాటుగా ఉన్న వ్యక్తులను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న మాయలాడిని రాజాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల్లోనే కేసు ఛేదించి నిందితురాలి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపాల్టీ పరిధి కొండంపేట గ్రామానికి చెందిన పున్నాన కాంతమ్మ ఈ నెల 24న స్థానిక ఆంధ్రాబ్యాంకుకు వచ్చింది. తాను పద్దుపెట్టిన బంగారాన్ని విడిపించేందుకు రూ. 60వేలు తీసుకువచ్చింది. లైన్‌లో ఉన్న కాంతమ్మ చేతి సంచిలో నగదును బ్యాంకులో మాటువేసిన ఓ మహిళ చేతివాటం ప్రదర్శించి అపహరించి అక్కడి నుంచి పరారైంది. కాసేపటికే నగదు అపహరణకు గురైన విషయం తెలుసుకున్న కాంతమ్మ తొలుత బ్యాంకు సిబ్బంది, తరువాత పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసిన రాజాం ఎస్సై వై.రవికిరణ్, క్రైం సిబ్బంది సుగుణాకరరావు, శ్రీరాములు, రాజేంద్రల సహాయంతో బ్యాంకులో సీసీ పుటేజీలతోపాటు బయట షాపుల వద్ద అమర్చిన సీసీ పుటేజీలను పరిశీలించారు. దొంగతనం చేసింది మహిళగా తెలుసుకుని ఆ దిశగా దర్యాప్తు చేపట్టి పశ్చిమగోదావరి జిల్లా దేవరాపల్లికి చెందిన కోదాడ ఏసమ్మను నిందితురాలిగా గుర్తించారు. ఆమె కోసం ఆరా తీయగా తాడేపల్లిగూడెం మండలం యాగర్లపల్లి గ్రామంలో బంధువుల ఇంటి వద్ద ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడికి వెళ్లి అమెను అరెస్టు చేసి రూ.60వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు.

చోరీకి గురైన నదు అందజేత

రాజాం సిటీ: రాజాం పట్టణంలో రెండు నెలల క్రితం దొంగతనానికి గురైన నగదును సీఐ కె.రవికుమార్ గురువారం బాధితుడికి అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సంతకవిటి మండలం చిన్నయ్యపేటకు చెందిన ఆర్.జనార్దనరావు ఈ ఏడాది ఫిబ్రవరి 28న బ్యాంకులో రూ.2 లక్షలు విత్‌డ్రా చేసి బండి డిక్కీలో ఉంచి పాలకొండ రోడ్డులోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ ముందు పార్కింగ్ చేసి షాపింగ్‌కు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి డిక్కీ తెరిచి ఉండడం, అందులో నగదు లేకపోవడంతో రాజాం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన క్రైం సిబ్బంది సీసీ పుటేజీల ఆధారంగా చిత్తూరు జిల్లా నగరి మండలం ఓజీకుప్పంలో నిందితుడు ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 1న అక్కడికి వెళ్లి నిందితుడు సుబ్రహ్మణ్యాన్ని అదుపులోకి తీసుకుని రూ. 2 లక్షల నగదు రికవరీ చేశారు. ఆ నగదును రాజాం కోర్టు ఆదేశాల మేరకు బాధితుడు జనార్దనరావుకు అందజేశారు.

ఆక్రమణల తొలగింపునకు అడుగులు



సమావేశంలో పాల్గొన్న చైర్మన్, అధికారులు

- జగన్నాథ సాగర్ అభివృద్ధికి గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల అమలు

జయపురం: పట్టణంలోని చారిత్రాత్మక జగన్నాథ సాగర్ అభివృద్ధికి విఘాతంగా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు ఉద్యమించనున్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టాలని జయపురం మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. సాగర్ స్థలాల్లో 43 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు. సమావేశంలో రాష్ట్ర భూమి మిషన్ స్పెషల్ అధికారి అలోక్‌చంద్ర సామంతరాయ్ పాల్గొన్నారు. సమావేశంలో రాజ కుటుంబీకుల భూమి(రిజర్వ్ స్థలం)పై, సాగర్ భూమిలో ఆక్రమణల తొలగింపుపై చర్చించారు. చుట్టూ ఉన్న క్రిస్టియన్‌పేట, పంచానన మందిర బైపాస్ రోడ్డు, రాజు శ్మశానం పశ్చిమ ప్రాంతం, ఇతర 43 కుటుంబాల ఇళ్లను తొలగించాలని, వారికి పునరావాసం కల్పించడంపై చర్చించారు. నిర్వాసితులను డొంగాగుడ, కుందారిగుడలో ఖాళీ స్థలాల్లో పునరావాసం కల్పించవచ్చని మున్సిపాలిటీ ఈఓ సిద్ధార్థ పట్నాయక్ ప్రతిపాదించారు. ఈ సందర్భంగా అశోక్‌చంద్ర సామంతరాయ్ మాట్లాడుతూ ఆక్రమణదారులను తొలగించే ముందు పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జయపురం రాజుల స్థలాల్లో అనేక ఏళ్లుగా వందలాది కుటుంబాలు నివాసం ఉంటున్నారని, వారికి పట్టాలు ఇవ్వక పోవడంపై రాజ కుటుంబీకులతో చర్చించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే నిర్వాసితులకు అన్ని మౌలిక సౌకర్యాలతో మోడల్ కాలనీ నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబానికి 323 చదరపు అడుగుల స్థలం సమకూర్చి, ప్రధానమంత్రి అవాస్ యోజనలో ఇల్లు నిర్మించాలని సూచించారు. సమావేశంలో చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జయపురం సబ్ కలెక్టర్ దేవధర ప్రధాన్, ఇంజినీర్ అజయకుమార్ జాని తదితరులు పాల్గొన్నారు.

పలువురిపై బైండోవర్ కేసుల నమోదు



భామిని: సతివాడ వివాదాలపై రెండు వర్గాలకు బైండోవర్ విధిస్తున్న తహసీల్దార్ అప్పారావు, ఎస్సై అమ్మాన్‌రావు

వీరఘట్టం: గతంలో సారా అమ్మకాలు చేపట్టిన, సారా తరలిస్తూ పట్టుబడిన, బడ్డీ కొట్టులో బుడ్డీలు విక్రయించిన 15 మందిపై వీరఘట్టం తహసీల్దార్ చందక సత్యనారాయణ బైండోవర్ నమోదు చేశారు. గతంలో వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. వారితో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అలాగే ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లి హాయిగా జీవించవచ్చని హితవు పలికారు.

భామినిలో..

భామిని: మండలంలోని సతివాడలో రేగిన స్థల వివాదంలో కొట్లాటకు దిగిన రెండు వర్గాలకు చెందిన 18 మందిపై బైడోవర్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.అమ్మాన్‌రావు గురువారం తెలిపారు. తహసీల్దార్ నీలాపు అప్పారావు ముందు రెండు వర్గాలను హాజరుపరచగా వివాదాస్పద స్థలం జోలికి ఎవరూ వెళ్లవద్దని, డాక్యుమెంట్ల ప్రకారం అప్పగిస్తామని వారికి తెలిపారు. అనంతరం రోజంతా సతివాడలో పికెట్ ఏర్పాటు చేసి వివాదాలకు ఆస్కారం లేకుండా చూశామని ఎస్సై తెలిపారు.

ఆరుగురిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు

మండలంలో గురువారం చేసిన డ్రంకన్ డ్రైవ్‌లో ఆరు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై అమ్మాన్‌రావు తెలిపారు. బహిరంగ మద్యపానంపై కూడా కేసులు పెట్టి, ఆరెస్టు చేస్తామని హెచ్చరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స



మొయిదలో మెగా రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మొయిదలోని ఆయన స్వగృహంలో మెగా రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. అపోహలు వీడి యువత రక్తదానానికి ముందుకు రావాలన్నారు. సంఘ సేవకుడు బొడ్డేపల్లి రామకృష్ణ రికార్డు స్థాయిలో 175వ సారి రక్తదానం చేయనున్న సందర్భంగా మే 1న విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహిస్తున్న మెగారక్తదా శిబిరాన్ని విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. రామకృష్ణ సేవా స్ఫూర్తిని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంకు, సేవా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవి విపత్తు నిర్వహణకు సన్నద్ధం

- రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖామంత్రి ప్రమీల మల్లిక్



విపత్తు సన్నద్ధతపై సమీక్షకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన ఉన్నతాధికారులు

భువనేశ్వర్: వేసవి కాలపు విపత్తు నిర్వహణకు యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి ప్రమీల మల్లిక్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహింఆచరు. ఈ సమావేశం అనంతరం వేసవిలో తరచూ ఉత్పన్నమవుతున్న తుఫాన్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉందని మంత్రి ప్రకటించారు. మే 1నుంచి శాఖలు, జిల్లాల్లో రాత్రింబవళ్లు(24, 7) కంట్రోల్ రూమ్‌లు పని చేయడం ప్రారంభం అవుతాయని తెలిపారు. అలాగే దీనికి సంబంధించి తీసుకోనున్న చర్యల గురించి వివరించారు. కంట్రోల్ రూమ్‌కు క్లాస్–1 అధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారు. ప్రతి సంవత్సరం తరహాలోనే జూన్ 18, 19 తేదీల్లో టేబుల్ టాప్ కసరత్తు, మాక్‌డ్రిల్ అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలు, వరదలు, తుఫాను కేంద్రాలు, మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామీణాభివృద్ధి శాఖ, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, తాగునీటి శాఖలు స్వతంత్ర విపత్తు నిర్వహణ ప్రణాళికలతో సిద్ధం కావాలని అదనపు ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక సహాయ కమిషనర్(ఎస్‌ఆర్‌సీ) సత్యబ్రత్ సాహు ఆదేశించారు.

- 317 అగ్నిమాపక కేంద్రాల్లో అవసరమైన పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బందితో సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్ ఏర్పాటు చేశారు.
- రాష్ట్రంలోని 342 ప్రాంతీయ అగ్నిమాపక సేవా బృందాలు ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధం చేశారు.
- జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) 3వ బెటాలియన్‌కు చెందిన 17 బృందాలు గాలింపు, సహాయక చర్యల కోసం సన్నద్ధంగా ఉన్నాయి.
- 16 బృందాలు ముండలిలో, మరొక యూనిట్ బాలాసోర్‌లో అందుబాటులో ఉంచారు.
- ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు, ఒడిశా స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ అథారిటీ(ఓస్డమా), ప్రత్యేక సహాయ కమిషనర్(ఎస్‌ఆర్‌సీ) సమన్వయంతో పనిచేస్తాయి.
- ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్‌వినియోగించే వాహనాలకు ఇంధనం అందించాలని మండల అభివృద్ధి అధికారులు(బీడీఓలు), తహసీల్దార్లకు అప్పగించారు.
- 879 మల్టీపర్పస్ సైక్లోన్, ఫ్లడ్ షెల్టర్లు సంభావ్య తుఫాన్ల కంటే ముందుగా నిర్వాసితులకు ఆశ్రయం కల్పించేందుకు ఉపయోగిస్తారు.
- జల వనరుల శాఖ సకాలంలో వరద అంచనా, వివిధ నదీ వ్యవస్థల నీటిమట్టం, ప్రవాహం రిజర్వాయర్ల వాస్తవ నిర్వహణను నిర్ధారిస్తుంది.
- పంచాయతీరాజ్, తాగునీటి శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ పారిశుద్ధ్యంపై అవసరమైన చర్యలు తీసుకోవడానికి అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేస్తాయి.
- పంచాయతీరాజ్, తాగునీటి శాఖలో 10 మొబైల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఉన్నాయి. విపత్కర ప్రాంతాల్లో ఈ ప్లాంట్లను ముందస్తుగా విస్తరిస్తారు.
- స్వల్ప వ్యవధిలో తుఫాను తదనంతర సహాయక, పునరుద్ధరణ, పునర్నిర్మాణ చర్యలకు యంత్రాంగం అనుక్షణం అందుబాటులో ఉంటుంది.
- వరద సంబంధిత వ్యాధులకు అవసరమైన మందులు, వాటర్ ప్యూరిఫైయర్లు, పాముకాటు చికిత్సకు ఇంజక్షన్లు జిల్లా ప్రధాన ఆస్పత్రిలో అందుబాటులో ఉంచారు.
- తుఫాను హెచ్చరికలు అందిన వెంటనే గర్భిణులను జిల్లా కేంద్ర ఆస్పత్రి, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, మాతాశిశు గృహాలకు తక్షణమే తరలించే చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.
- పశుగ్రాసం నిల్వ, సరఫరా అయ్యేలా మత్స్య, జంతు వనరుల శాఖ అవసరమైన ఏర్పాట్లు చేస్తుంది.
- పశు వైద్యశాలల్లో వర్షాకాలానికి ముందు పశు వైద్యం అందుబాటులో ఉంచడంతోపాటు పశువులకు టీకాలు వేయించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటారు.

గ్రామానికి చేరిన ఆర్మీ జవాన్ మృతదేహం



అవలంగిలో ఆర్మీజవాన్ అరుణ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, గ్రామస్తులు

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో అస్వస్థతకు గురైన ఆర్మీ జవాన్ నగరపు అరుణ్‌కుమార్ (36) ఈనెల 24న వెస్ట్‌బెంగాల్‌లో మృతిచెందారు. ఆయన మృతదేహం బుధవారం రాత్రి స్వగ్రామమైన పాలకొండ మండలం అవలంగికి చేరింది. ఆర్మీ అధికారులు ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. గురువారం సంప్రదాయబద్ధంగా జవాన్ మృతదేహాన్ని ఖననం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత సైనికోద్యోగుల సంఘం నాయకులు దుప్పాడ పాపినాయుడు, ప్రసన్నకుమార్, వెన్నపు వెంకటరమణతో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు. అశ్రునయనాల మధ్య అరుణ్‌కుమార్‌కు స్థానికులు, అధికారులు నివాళులర్పించారు.

పురుగు మందు తాగేసిన విద్యార్థి..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని గదబవలస గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి కోండ్రు హరీష్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగేశాడు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫస్టియర్, సెకెండ్ ఇయర్‌లో పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో కుటుంబ సభ్యులు ఏమైనా అంటారేమోనని భయాందోళనకు గురై ఇంట్లో ఉంచిన పురుగు మందు తాగేశాడు. కొంత సమయం తరువాత స్పృహ తప్పిపోవడంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడినుంచి విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఈ విషయమై గరివిడి ఎస్సై ఎల్.దామోదర్‌రావు వద్ద ప్రస్తావించగా ఈ విషయం తమ నోటీసులోకి వచ్చిందని,ఫైల్ చేసుకున్నామని తెలిపారు.

ఆటో, బైక్ ఢీకొని యువకుడికి గాయాలు

చీపురుపల్లి: పట్టణంలోని లావేరు రోడ్‌లో గురువారం సాయంత్రం ఆటో, బైక్ ఢీ కొన్న సంఘటనలో గంటాన వాసుకు గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో 108 వాహనంలో క్షతగాత్రుడిడిని తరలించి చీపురుపల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో చేర్పించి వైద్య సహాయం అందిస్తున్నారు. మండలంలోని రావివలస గ్రామానికి చెందిన గంటాన వాసు ద్విచక్ర వాహనంపై చీపురుపల్లి వస్తుండగా అదే రోడ్‌లో భారత్ గ్యాస్ ఆటో గొడౌన్‌కు వెళ్లోంది. రెండు వాహనాలు ఎదెరెదురుగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది.

క్లుప్తంగా

కౌన్సిలర్‌పై దాడి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలోని 9వ వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్‌పై నిమ్మన పెద్దబాబు, అతని కుమారుడు నిమ్మన రాములు దాడిచేసినట్లు ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గోర్జివీధికి చెందిన నిమ్మన పెద్దబాబు వృద్ధురాలైన అతని తల్లి నిమ్మన ముత్యాలు (70)ను ఇంటి నుంచి వెల్లగొట్టి తిండికూడా పెట్టకుండా ఇబ్బంది పెడుతున్నాడు. వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్‌కు తన గోడు వివరించడంతో వృద్ధురాలికి మద్దతుగా నిలిచారు. పెద్దబాబు స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయానికి వస్తే అన్ని విషయాలు మాట్లాడుతామని చెప్పడంతో కౌన్సిలర్ గురువారం ఆలయం వద్దకు వెళ్లారు. ఈ సమయంలో పెద్దబాబు, అతని కుమారుడు రాము తమ కుటుంబ విషయాల్లో జోక్యం చేసుకోవద్దంటూ దాడి చేసినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలర్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదుచేశారు.

వంతెన గోడను ఢీకొట్టిన కంటైనర్


ప్రమాదంలో గాయపడిన రాజేష్

టెక్కలి రూరల్: టెక్కలి జాతీయ రహదారిపై గురువారం ఒకే కారణంతో రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. టెక్కలి మండలం లచ్చన్నపేట సమీపంలో జాతీయ రహదారిపై పశ్చిమబెంగాల్ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ కంటైనర్ బ్రేక్ ఫెయిల్ కావడంతో వంతెన గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు అవ్వలేదు. అయితే లారీ రహదారికి అడ్డంగా ఉండిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు వన్‌వేలో వాహనాలను మళ్లించారు. అదే సమయంలో కోటబొమ్మాళి నుంచి టెక్కలి వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న కోటబొమ్మాళికి చెందిన మేడిబోయిన రాజేష్‌ను ఎదురు మార్గంలో పలాస నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజేష్‌కు తీవ్రగాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాత్రల బందోబస్తు భేష్

గార: మండలంలో ఇటీవల జరిగిన శాలిహుండం, వత్సవలస, శ్రీకూర్మం యాత్రల్లో బందోబస్తు నిర్వహణ బాగుందని ఎస్పీ జి.ఆర్ రాధిక అన్నారు. గురువారం గార పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. యాత్రల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసు యంత్రాంగం పనిచేసిందన్నారు. మండలంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. వంశధార నదిపై బ్రిడ్జి నిర్మాణం జరుగుతోందని, ఈ నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌ను వేరేచోట నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. స్థల సేకరణ త్వరగా జరగాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేంద్ర, సీఐ పి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

ఎచ్చెర్ల క్యాంపస్: క్రీడలు విద్యార్థుల జీవితంలో భాగం కావాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్ క్యాంపస్ స్పోర్ట్స్ మీట్‌ను గురువారం ప్రారంభించారు. విద్యార్థుల సంక్షేమ విభాగం, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ మెరుగైన ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఆడే అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో చాన్సలర్ ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలనాధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, అధికారులు గేదెల రవి, అసిరినాయుడు, మామిడి షణ్ముఖ, దిలీప్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

సేతుభీమవరంలో ఇల్లు దగ్ధం


కాలిపోతున్న ఇల్లు

జి.సిగడాం: మండలంలోని సేతుభీమవరంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో బొల్లు నారాయణరావుకు చెందిన ఇల్లు దగ్ధమైంది. దేవుడి పటం వద్ద వెలిగిన దీపం ఒత్తును ఎలుకలు ఎత్తుకుపోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గ్రామస్తులు స్పందించేలోపే ఇల్లు కాలిపోయింది. ఈ ఘటనలో రూ.3 లక్షల నగదు, తులం బంగారం, తిండి గింజలు కాలి బూడిదయ్యాయి. బూడిదైనాయి. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి రూ.5లక్షల ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేశారు. తక్షణ సాయం కింద బియ్యం, నిత్యావసర సరుకులను తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు పంపిణీ చేశారు.

ఒక్క క్షణం..!

ఆలోచిద్దాం



- జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు
- క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోతున్న వైనం
- పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలంటున్న నిపుణులు

ఎచ్చెర్ల క్యాంపస్/అరసవల్లి/శ్రీకాకుళం క్రైమ్:

పరీక్షలో ఉత్తీర్ణత కాలేదని విద్యార్థి.. ఇంట్లో అమ్మ తిట్టిందని కుమార్తె.. ఆస్తి కోసం కొడుకుల గొడవలను చూడలేక ఓ తండ్రి.. భార్య చనిపోవడాన్ని తట్టుకోలేక భర్త.. ఇలా ఇటీవల కాలంలో జిల్లాలో పలువురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఇలాంటి పరిస్థితులకు దారితీసిన కారణాలను విశ్లేషిస్తే చిన్నపాటి అంశాలే ప్రాణాలను తీసుకునేలా ప్రేరేపించాయని చెప్పవచ్చు. బలహీన క్షణాలను, ప్రతికూల పరిస్థితులను సరిగ్గా ఎదుర్కొనలేకే అర్ధాంతరంగా ఆయువు తీసుకుంటున్నారు. జిల్లాలో కొన్నాళ్లుగా పరిస్థితులను గమనిస్తే వారానికి కనీసం ఒకరిద్దరు ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇది ఓ రకంగా ఆందోళన కలిగించే అంశంగానే పరిగణించాల్సి ఉంది. కుంగుబాటుకు గురవుతున్న వారిని ముందుగానే గుర్తించి వారిలో స్థైర్యం పెంపొందించేలా వ్యవహరించాలని మానసిక వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఆత్మహత్యలకు కారణం..



- సమస్యలకు కుంగిపోవడం
- పరిష్కారం ఆలోచించక పోవడం
- తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు, లక్ష్యాలను పిల్లలపై రుద్దడం
- బలహీన పడుతున్న కుటుంబ వ్యవస్థ
- విద్యాలో వ్యాపార ప్రయోజనాలు, మార్కులు చదువులకు ప్రాధాన్యం పెరగడం

ఇవి గుర్తుంచుకోండి..



- మార్కులే జీవితం కాదని తల్లిదండ్రులు ప్రధానంగా గుర్తించాలి. అప్పుడు చాలా వరకు విద్యార్థులు ఆత్మహత్యల జోలికి వెళ్లరు.
- విద్యార్థులు మానసికంగా, శారీరకంగా, నైతికంగా బలంగా ఉండాలి.
- పరిస్థితులను ఎదుర్కొనే శక్తి కలిగిఉండాలి. కుటుంబ సభ్యులు మృతి చెందితే ఇతర సభ్యులు ఆత్మహత్య చేసుకోవడం పరిష్కారం కాదు.
- పెంపకం చాలా కీలకం. సమస్యను ఎదుర్కొనే శక్తిని చిన్నప్పటి నుంచే అలవాటు చేసుకోవాలి. సమస్యలపై నిరంతరం చర్చించాలి.
- వ్యక్తిత్వ వికాసంపై విద్యా సంస్థల్లో శిక్షణ ఇప్పించాలి.

ఇటీవల జరిగిన ఘటనలివే..

ఏప్రిల్ 1: మెళియాపుట్టి మండలం చీడిపాలెంకు చెందిన గ్రామ వలంటీర్ సవర కేశమ్మ (29) భర్తకు దూరంగా ఉండడాన్ని తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.

ఏప్రిల్ 10: గార మండలం దీపావళి గ్రామానికి చెందిన గొండు రాజేష్ (19) అనే ఇంజినీరింగ్ విద్యార్థి పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక పురుగుల మందు తాగి బలవన్మరణం చెందాడు.

ఏప్రిల్ 11: మెళియాపుట్టి మండలం చాపరలో ఇద్దరు కుమారుల ఆస్తి గొడవలతో మనస్తాపానికి గురై పట్టుపగలు గురుమూర్తి (70) బావిలో పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఏప్రిల్ 16 : మెళియాపుట్టి మండలం పెద్దమడి గిరిజన సంక్షేమ పాఠశాల 8వ తరగతి విద్యార్థి సవర సుమంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఏప్రిల్ 16: ఇంట్లో అమ్మ మందలించిందని శ్రీకాకుళంలో ఓ బాలిక నాగావళి నదిలో దూకేసి ఆత్మహత్యకు పాల్పడింది.

ఏప్రిల్ 19: మెళియాపుట్టి మండలం కొసమాల గ్రామానికి చెందిన వరిసి వినోద్ (26) మానసిక కారణాలతో ఉరివేసుకుని మృతి చెందాడు.


మంగరాజు, మౌనిక (ఫైల్ ఫొటో)

ఏప్రిల్ 20: ఆమదాలవలస మండలం ఈసర్లపేటకు చెందిన ఆర్మీ జవాన్ మంగరాజు రాజబాబు... తన భార్య మౌనిక మృతిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఏప్రిల్ 27: ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణత సాధించలేదని సంతబొమ్మాళి మండలం గట్టుగోపాలపురం గ్రామానికి చెందిన బాలక తరుణ్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఫ్యాన్‌కు ఉరివేసుకుని..


వడ్డి రాజు (ఫైల్)

గార: రామచంద్రాపురం గ్రామానికి చెందిన వడ్డి రాజేశ్వరరావు అలియాస్ రాజు (28) గురువా రం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డి రాజు బీటెక్ చదువు పూర్తయిన తర్వాత విశాఖలోని ఓ జ్యూయలర్స్ షోరూంలో పనిచేసేవాడు. అక్కడ మానేసి నారాయణ విద్యాసంస్థ లో చేరాడు. గురువారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణ తేలిందని ఎస్సై మధుసూదనరావు తెలిపారు.

పురుగుల మందు తాగి..


రాధాకృష్ణ (ఫైల్)

సారవకోట: మాళువ గ్రామానికి చెందిన విష్ణు రాధాకృష్ణ (37) పురుగు ల మందు తాగి ఆత్మహత్య కేసుకున్నాడు. హెచ్‌సీ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. రాధాకృష్ణ, ఈశ్వరి భార్యాభర్తలు. వీరికి కుమారుడు భాస్కరరావు, కుమార్తె సరోజని ఉన్నారు. దంపతుల మధ్య బుధవారం చిన్నపాటి మనస్పర్థలు ఏర్పడ్డాయి. మద్యం మత్తులో రాధాకృష్ణ పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు పాతపట్నం సీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

కన్నవారికి కడుపుకోత

- ఇంటర్మీడియెట్‌లో ఫెయిలైన విద్యార్థి ఆత్మహత్య


తరుణ్(ఫైల్)

టెక్కలి రూరల్: ఇంటర్మీడియెట్‌లో అన్ని సబ్జెక్టులు తప్పిన ఓ విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన టెక్కలి జిల్లా ఆస్పత్రి సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గురువారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామానికి చెందిన బాలక కృష్ణారావు, దమయంతి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు హరి విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. చిన్న కొడుకు తరుణ్(17) టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి మూగవాడు. తల్లిదండ్రులు రాజమండ్రిలో కూలి పనులు చేసుకుంటున్నారు. తరుణ్ తన తాత బాలక రామ్మూర్తి వద్ద ఉంటూ టెక్కలిలో చదువుకుంటున్నాడు. బుధవారం విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తరుణ్ ఒక్క సబ్జెక్టు కూడా పాస్ కాలేదు. దీంతో మనస్థాపం చెంది బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కనీసం ఒక్క సబ్జెక్టు కూడా పాస్ కాకపోవడంతో నలుగురూ హేళన చేస్తారని మనస్థాపంతో టెక్కలి కొత్త జిల్లా ఆస్పత్రి సమీపంలో రైల్వే ట్రాక్‌పై గురువారం వేకువజామున 5 గంటల సమయంలో గుణుపూర్ -కటక్ రైలు కింద తలపెట్టేశాడు. అది చూసిన ఇంజిన్ డ్రైవర్ రైలు ఆపే ప్రయత్నం చేసినా అప్పటికే మొండెం నుంచి తల వేరైపోయింది. అనంతరం రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, స్థానికులు మృతదేహాన్ని పరిశీలించి పరీక్షలు తప్పినందుకు నిండు జీవితం బలిచేసుకున్నాడని, తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చి వెళ్లిపోయాడని శోకసంద్రంలో మునిగిపోయారు. రైల్వే ఏఎస్‌ఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చావే పరిష్కారం కాదు...



డబ్ల్యూహెచ్‌వో నిబంధనల ప్రకారం చూస్తే..అధిక శాతం పిల్లల్లో మానసిక స్థైర్యం తగ్గిపోతోంది. జీవన విధానంలో కష్టం వస్తే ఎలా నిలదొక్కుకోవాలో అటు తల్లితండ్రులు ఇటు ఉపాధ్యాయులు కూడా చెప్పడం లేదు. ఫలితంగా కుంగుబాటుకు గురై ఆత్మహత్య చేసుకుంటున్నారు. తమ సమస్యల నుంచి ఎలా గట్టెక్కాలో తెలుసుకునే ధైర్యం ఉంటే ఇలాంటి ఘటనలు జరగవు. అన్ని వయస్సుల వారికి కూడా కష్టం వస్తే తట్టుకునే తత్వం పెంచేలా చేయాలి. ఇప్పుడు ప్రైవేటు విద్య విధానంలో తీవ్ర ఒత్తిడి చదువులు కూడా చావులకు కారణమవుతున్నాయి. చావు ఒక్కటే పరిష్కారం కాదు. – డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్‌ఓ

మానసిక స్థైర్యం అవసరం..



ప్రతి మనిషి సమస్యలు ఎదుర్కొంటాడు. బలహీనులే ఆత్మహత్యకు పాల్పడతారు. ప్రధానంగా తల్లిదండ్రులు మానసికంగా బలంగా ఉండాలి. పిల్లలు సమస్యలు ఎదుర్కొని ముందుకు సాగేలా వారిని తీర్చిదిద్దాలి. జీవితంలో మార్కులు మాత్రమే కీలకం కాదన్న విషయం గుర్తుంచుకోవాలి. విలువలు, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు కీలకంగా గుర్తించాలి. ప్రముఖుల బయోగ్రఫీలు విద్యార్థులకు కథలుగా చెప్పాలి. ముఖ్యంగా ఇతరుల పిల్లలతో తమ పిల్లలను పోల్చవద్దు. కష్టాల నుంచి గట్టెక్కే ధైర్యం, సమస్య పరిష్కరించే నైపుణ్యం రెండూ కీలకం. – డాక్టర్ జేఎల్ సంధ్యారాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, సైకాలజీ కౌన్సిలర్


బాధాకరం



పసి హృదయాలు మొగ్గదశలోనే చితికిపోవడం బాధాకరం. క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి కన్నవారికి శోకం మిగుల్చుతున్నారు. ఇలాంటివి జరగకూడదనే జిల్లాలో చిన్నారికి చేదోడు కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. సీనియర్ సిటిజన్లతో ప్రతిరోజూ జిల్లాలో కొన్ని స్కూళ్లను ఎంపిక చేసుకుని పదో తరగతి లోపు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. మహిళా పోలీసులతోనూ అవగాహన కల్పిస్తు న్నాం. మానవ జీవితం ఓ వరం. మనకంటూ ఓ లక్ష్యాన్ని గట్టిగా ఏర్పర్చుకుని జీవితంలో ఉన్నత స్థానాన్ని సాధించాలి. ధైర్యంగా పోరాడాలి. – టి.పి.విఠలేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ

ఆన్‌లైన్ సేవల్లో ఆదిత్య క్షేత్రం

- రాష్ట్రంలో 16 ప్రధాన దేవాలయాల సరసన అరసవల్లి
- 15–30 రోజుల ముందే గదులు, దర్శనాలు, సేవల టికెట్లు బుక్ చేసుకునే అవకాశం
- సూర్యనమస్కార పూజలు సైతం అందుబాటులోకి..
- ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించిన దేవదాయ శాఖ



వెబ్‌పోర్టల్‌లో అరసవల్లి ఆదిత్యుడు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ప్రత్యేకంగా దర్శించుకుని.. ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకోవాలంటే ఇప్పుడు ఎలాంటి హైరానా పడాల్సిన అవసరం లేదు. రెండు వారాల ముందే పూజలకు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు. ఇలా భక్తులకు మరింత చేరువయ్యేందుకు రాష్ట్ర దేవదాయ శాఖ ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్ ప్రారంభించింది. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకునేలా ఆన్‌లైన్ సేవలను సరళతరం చేసింది. 15–30 రోజుల ముందే ప్రముఖ ఆలయాల్లో గదులు, దర్శనాలు, వివిధ రకాల ఆర్జిత సేవల టికెట్లను బుకింగ్ చేసుకునేలా వ్యవస్థను సిద్ధం చేసింది. ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానం వంటి ప్రసిద్ధ ఆలయాల్లో సాంకేతిక సేవలు అద్భుతంగా పనిచేస్తున్న తరుణంలో రాష్ట్రంలో ఉన్న మరిన్ని ప్రసిద్ధ ఆలయాలకు ఇదే విధానం అమలు చేసేలా దేవదాయ శాఖ నిర్ణయించింది.

వెబ్‌పోర్టల్ సిద్ధం..

రాష్ట్రంలోని అన్నవరం, సింహాచలం, ద్వారకాతిరుమల, విజయవాడ దుర్గగుడి, పెనుగంచిప్రోలు, శ్రీశైలం, కాణిపాకం, శ్రీకాళహస్తి, మహానంది, విశాఖపట్నం కనకమహాలక్ష్మి, అంతర్వేది, మోపిదేవి సుబ్రహ్మణ్య స్వామి, మురమళ్ల వీరేశ్వరస్వామి, వాడపల్లి వెంకటేశ్వరస్వామి, కసాపురం నెక్కంటి ఆంజనేయస్వామి తదితర దేవస్థానాలతో పాటు అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయాల్లో ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్ సేవలు భక్తులకు అందనున్నాయి. ఈమేరకు ఏపీటెంపుల్స్.ఎపి.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్ (9 అండ్ 9)ను సిద్ధం చేసింది. ఈ పోర్టల్ ఓపెన్ చేయగానే ఈ పైన పేర్కొన్న ఆలయాల చిత్రాలు కనిపిస్తాయి. మనకు ఏ ఆలయానికి చెందిన సమాచారం కావాలంటే..ఆ ఆలయ పోర్టల్ వద్ద క్లిక్ చేస్తే...గదులు, దర్శనాల టికెట్లు, ఆర్జిత సేవల టికెట్ల వివరాలు కనిపిస్తాయి. మనకు కావాల్సిన టికెట్లపై క్లిక్ చేసి పేమెంట్ మోడ్‌లో పే చేస్తే.. అడ్వాన్స్ బుకింగ్ జరుగుతుంది. వెంటనే సెల్‌ఫోన్‌కు మెసేజి రూపంలో సమాచారం అందుతుంది.

అరసవల్లి ఆన్‌లైన్ సేవలివే..

వెబ్‌సైట్: ఏపీటెంపుల్స్.ఎపి.జీవోవి.ఇన్
వసతి గదులు: 07 (ఒక్కో గది రూ.300)
ఆదిత్యుని విశిష్ట దర్శనం : రూ.500 (ఆదివారం మాత్రమే)
ప్రత్యేక దర్శనం : రూ.100 (ఆదివారం మాత్రమే)
ఆదిత్యుని క్షీరాభిషేకం: రూ.500 (మాస సంక్రమణం తేదీల్లో)
కల్యాణ సేవ : రూ.500 (శుద్ధ ఏకాదశి, బహుళ ఏకాదశి తేదిల్లో)
సూర్యనమస్కారాల పూజలు : రూ.300 (ప్రతిరోజూ), రూ.100 (ప్రతి ఆదివారం)
అష్టోత్తర శత నామార్చన: రూ.50 (పరోక్ష సేవ)
సహస్ర నామార్చన : రూ.100 (పరోక్ష సేవ)

మరింత సౌకర్యవంతంగా..



దేవదాయ శాఖ నిర్వహణలో ఉన్న ఈ పోర్టల్ ద్వారా అరసవల్లి ఆలయంలో నిర్వహిస్తున్న సేవల టికెట్లను ఆన్‌లైన్‌లో అడ్వాన్స్‌గా పొందవచ్చు. ఆన్‌లైన్లో సేవలందించే ప్రధాన ఆలయాల్లో అరసవల్లిని చేర్చడంతో ఆరోగ్యం కోసం ఆలయాన్ని దర్శించుకోవాలనుకున్న సుదూర ప్రాంత భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఈ పోర్టల్‌లో మరిన్ని సేవలను పొందుపరిచేలా చర్యలు చేపడుతున్నాం. – వి.హరిసూర్యప్రకాష్, ఆదిత్యాలయ ఈఓ, అరసవల్లి

మండుటెండలో కొండను ఎక్కి..


చందనగిరిలో గిరిజనులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- గిరిశిఖర గ్రామాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: ఇదివరకు ఎన్నడూ ప్రజాప్రతినిధులెవరూ ఆ గ్రామానికి వెళ్లలేదు. అక్కడి గిరిజనుల సమస్యలు తెలుసుకోలేదు. మొట్టమొదటి సారిగా మహిళా ఎమ్మెల్యే రెడ్డి శాంతి గ్రామాన్ని సందర్శించి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. దీంతో గిరిజనుల సంతోషానికి అవధులు లేకుండాపోయాయి. మెళియాపుట్టి మండలంలోని గిరిశిఖర గ్రామమైన చందనగిరిలో గురువారం జగనన్నే మా భవిష్యత్. మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండుటెండలో 14 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కొండపై ఉన్న గిరిజనులతో మమేకమయ్యారు. గతంలో అధికారులు తప్ప ప్రజాప్రతినిధులెవ్వరూ తమ గ్రామం వైపు చూడలేదంటూ గిరిజన మహిళలు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గూడ ఎండయ్య, నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ అప్పారావు తదితరులు

- జిల్లా పోలీసు శాఖ పనితీరు భేష్
- రాష్ట్ర బాలల రక్షణ, హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

శ్రీకాకుళం క్రైమ్ : బాలల హక్కులను పరిరక్షించడం అందరి బాధ్యతని రాష్ట్ర బాలల రక్షణ, హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ కేసలి అప్పారావు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాలల హక్కులు, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలపై అరికట్టాలన్నారు. ఈ విషయంలో ఎస్పీ జి.ఆర్.రాధిక పర్యవేక్షణలో పోలీసుల పనితీరు రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండటం అభినందనీయమన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఈ ఏడాదిలో సుమారు 6230 మంది విద్యార్థులకు బాలల హక్కులు, ముఖ్య చట్టాలపై అవగాహన కల్పించారన్నారు. ప్రతి వసతిగృహంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయించాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిస కాకుండా ఉపాధ్యాయులు, నిర్వాహకులు, తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు మాట్లాడుతూ ఎస్పీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చిన్నారికి చేదోడు కార్యక్రమం జిల్లాలో సత్ఫలితాలనిస్తోందన్నారు. గత ఏడాది 2022–2023 మార్చి వరకు 165 బాలబాలికలను రక్షించి అందులో 150 మందిని తల్లిదండ్రులకు అప్పగించామని వివరించారు. రాష్ట్ర బాలల రక్షణ, హక్కుల కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలోనే శ్రీకాకుళం ఏహెచ్‌టీయూ విభాగం సమర్థంగా పనిచేస్తోందన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ 2022 జనవరి నుంచి 2023 ఏప్రిల్ వరకు బాలకార్మికులు, మిస్సింగ్, బాల్యవివాహాలు తదితర అంశాలపై 93 కేసులు నమోదుచేశామన్నారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణకు చైల్డ్‌లైన్ విభాగం ప్రచురించిన గోడపత్రికను ఆవిష్కరించారు. డీసీపీఓ కె.వి.రమణ, డీఎస్పీ ఎస్.వాసుదేవ్, డాక్టర్ కృష్ణమోహన్, సీఐ బి.ప్రసాదరావు, ప్రభుత్వ విభాగాల, ప్రభుత్వేతర సంస్థల అధికారులు, ప్రతినిధులు, నిర్వాహకులు, చైల్డ్ వెల్ఫేర్ పోలీసు అధికారులు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

మడపాం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి చర్యలు


మడపాం ఓపెన్ హెడ్ చానెల్‌ను పరిశీలిస్తున్న డీఈ కామరాజు

నరసన్నపేట: మడపాం వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని ఏపీఎస్ ఐడీసీ డీఈ ఎం.కామరాజు తెలిపారు. మడపాం, గోపాలపెంట, పోతయ్యవలసతో పాటు మరో ఆరు గ్రామాల రైతుల పొలాలకు సాగునీరు అందించేందుకు వీలుగా ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఇటీవల నిధులు మంజూరు చేశారని చెప్పారు. దీంట్లో భాగంగా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సూచనల మేరకు గురువారం మడపాంతో పాటు ఇతర గ్రామాల పరిధిలోని వంశధార, ఓపెన్ హెడ్ చానల్స్‌ను పరిశీలించినట్లు తెలిపారు. మే 15 కల్లా డీపీఆర్ సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.ఈ సందర్భంగా రైతుల ప్రతినిధి కనలప శేఖర్, అటవీ కార్పొరేషన్ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, ఎంపీటీసీ మల్లేశ్వరరావు, గోపాలపెంట సర్పంచ్ యండ కృష్ణవేణిలు మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తే సాగు నీరు పుష్కలంగా అందుతుందని, ఇందుకు కృషి చేసిన ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు. ఏఈలు బి.అనిల్, జి.మధుసూదనరావు, టీఏ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: భగీరథ మహర్షి పట్టుదలతో దివి నుండి భువికి లోక కల్యాణం కోసం గంగను తెచ్చిన మహానుభావుడని, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ కొనియాడారు. గురువారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సలహాదారు మూల నారాయణరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ, బీసీ సంక్షేమ శాఖ జాతీయ కార్యదర్శి బి.దేవభూషణరావు, ఉప్పర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరావు, పాల్గొన్నారు.


మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

పక్కాగా తరగతుల నిర్వహణ

ఎచ్చెర్ల క్యాంపస్: పక్కాగా క్లాస్ వర్కు జరగాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. ఎచ్చెర్లలోని వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో గురువారం అధికారులతో అకడమిక్ వ్యవహారాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతుల నిర్వహణ, పరీక్షలు సకాలంలో జరగాలన్నారు. మిడ్ సెమిస్టర్ పరీక్షలు సైతం నిబంధనల మేరకు జరగాలన్నారు. విద్యార్థుల హాజరు కనీసం 75 శాతం ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థుల హాజరు ప్రతి నెలా నోటీస్ బోర్డులో పొందుపరచాలని సూచించారు. పీజీ ప్రవేశాలు మెరుగ్గా జరగాలంటే అన్ని విభాగాలు బలోపేతం కావాలన్నారు.

వైద్యురాలికి తప్పిన ప్రమాదం

సారవకోట: మండలంలోని వడ్డినవలస సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొంతు పీహెచ్‌సీ వైద్యురాలు భార్గవికి పెను ప్రమాదం తప్పింది. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వైపు వెళ్తున్న ఆమె కారు వడ్డినవలస సమీపంలో అదుపు తప్పి రోడ్డుకు పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఆమె సీటు బెల్టు పెట్టుకోవడంతో క్షేమంగా బయటపడింది. స్థానికులు వెంటనే వెళ్లి ఆమెను కారు నుంచి బయటకు తీశారు. వైద్యురాలికి ఎటువంటి గాయాలు కాలేదు.